సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం। 12। ఆగస్టు। 2024



సోమశిలలో 17.293 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం నాటికి 17.293 టీఎంసీలు ఉన్నాయి. 12,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దిగువకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.71,820
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,450
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,644
సవర (8 గ్రాములు)	రూ.53,152

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.2 /28.6

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. పగటి వాతావరణం అత్యధిక వేడిగా ఉంటుంది. గాలిలో తేమ 58 శాతం ఉంది.

న్యూస్‌రీల్

17న ఉపరాష్ట్రపతి జిల్లా పర్యటన

నెల్లూరు (దర్గామిట్ట): భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఈ నెల 17న నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఒ. ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ ఉదయం 8.35 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి 9.50 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు నెల్లూరులోని పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 10.50 గంటలకు వెంకటాచలంలోని అక్షర విద్యాలయం, స్వర్ణభారత్ ట్రస్ట్‌ల్లో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.55 గంటలకు తిరిగి పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయం వెళ్తారని వివరించారు.

విధుల నుంచి యాక్టివ్ సూపర్‌వైజర్ తొలగింపు



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి సెక్టార్ యాక్టివ్ సూపర్‌వైజరుగా విధులు నిర్వహిస్తున్న కళావతిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఇన్‌చార్జి సీడీపీఓ పద్మావతి తెలిపారు. ఆమె ఉదయగిరిలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో విధుల నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని మహ్మదాపురం, పాపన్నగారిపల్లి పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు వేర్వేరు పంచాయతీల్లో ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా రెండింటినీ విలీనం చేశారన్నారు. నిబంధనల మేరకు ఒకే పంచాయతీలో ఉన్న రెండు కేంద్రాలను మాత్రమే విలీనం చేయాల్సి ఉందని తెలిపారు. ఈ విషయమై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమెను యాక్టింగ్ సూపర్‌వైజర్‌గా తొలగిస్తున్నట్లు తెలిపారు.

విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థానం

- పోటీతత్వంతోనే ప్రతిభ వెలుగు
- పొగాకు బోర్డు డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు
- 220 మంది గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల సభలో మాట్లాడుతున్న పొగాకు బోర్డు డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

నెల్లూరు (బృందావనం): విద్య ద్వారానే జీవితంలో ఉన్నతంగా ఎదగగలమన్న ఆత్మవిశ్వాసంతో ప్రతి విద్యార్థి లక్ష్యంతో గమ్యం వైపు ముందుకు సాగాలని పొగాకు బోర్డు (గుంటూరు) డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. నగరంలోని పురమందిరంలో ఆదివారం నెల్లూరు జిల్లా గౌడ కల్లు గీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కోసూరు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 10వ తరగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ప్రభుత్వ పాఠశాల్లో చదివిన 220 మంది గౌడ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ చదువును మించిన ఆయుధం లేదనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తించాలన్నారు. పోటీతత్వంతోనే ప్రతిభ వెలుగులోకి వచ్చి తద్వారా గుర్తింపు కలుగుతుందన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (సీమాట్)వెంపులూరు నాగూరు మస్తానయ్య మాట్లాడుతూ గౌడ సేవా సమితి ట్రస్ట్ వ్యవస్థాపకుడు దివంగత కోసూరు గోవిందయ్యగౌడ్ గౌడ విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం 12 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఆయన కుమారుడు ట్రస్ట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కోసూరు రాజశేఖర్‌గౌడ్ కొనసాగించడం హర్షణీయమన్నారు. ఆ ట్రస్ట్ అధ్యక్షుడు విశ్రాంత డీఎస్పీ తోట ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ అద్దంకి శ్రీధర్‌బాబు తన లక్ష్యమైన ఐఏఎస్‌ను సాధించేందుకు చేసిన కృషిని వివరించారు. శ్రీధర్‌బాబు జీవితాన్ని ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెబ్ డిప్యూటీ కమిషనర్ తిరగాబత్తిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాయుడు రామ్‌ప్రసాద్‌గౌడ్, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ కుడుముల అశోక్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.కృష్ణమూర్తి, డాక్టర్ ఎన్.వెంకటచలపతిగౌడ్, ప్రొఫెసర్ రావుల లావణ్యగౌడ్, నడవడి ముత్యంగౌడ్, ఆలపాక శ్రీనివాసులు, ఉప్పాల రామకృష్ణయ్య, రాజాగౌడ్ చినగోవిందు జిల్లాలోని గౌడ సంఘ నేతలు పాల్గొన్నారు.

వెలుగొండల్లో.. పులుల గాండ్రింపులు

- శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి పెనుశిల అభయారణ్యం వరకు పులుల జోన్
- వ్యాఘ్రాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- ప్రణాళికలు రూపొందిస్తున్న ఉన్నతాధికారులు

రెండు పెద్ద పులులు, 20కు పైగా చిరుతల సంచారం



టైగర్ ఫ్రీ జోన్ వెలుగొండల్లో ఇప్పుడు పులుల గాండ్రింపులు వినిపిస్తున్నాయి. శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి పెనుశిల అభయారణ్యం మధ్య వరకు ఉన్న వెలుగొండ అటవీ ప్రాంతం కూడా పులుల ఆవాసంగా మారింది. ఒకటి..రెండు పెద్ద పులులు చిక్కని అటవీ ప్రాంతం మధ్యలో ప్రవహిస్తున్న పెన్నానది ఆవాసంగా శ్రీపెనుశిల నరసింహస్వామి అభయారణ్యంలోకి ప్రవేశించినట్లు అధికారులు గుర్తించారు. ఈ కొత్త పరిణామాలతో శ్రీశైలం టైగర్ రిజర్వ్‌కు ఆత్మకూరు రేంజ్ అనుసంధానం చేసి పులుల సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు:

అడవికే రారాజు.. నడకలో రాజసం.. చూపుల్లో పౌరుషం.. గాండ్రిస్తే అడవంతా గాంభీర్యం. వేటలోనూ.. జీవనంలోనూ విభిన్నత్వం పుణికి పుచ్చుకున్న పులులకు నిన్నటి వరకు అటు శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఇటు శేషాచలం అటవీ ప్రాంతాలు ఆవాసాలుగా ఉన్నాయి. తాజాగా జిల్లా పరిధిలోని వెలుగొండ, శ్రీపెనుశిల నరసింహస్వామి అభయారణ్యం ప్రాంతం కూడా పులుల ఆవాసంగా మారింది. వన్య ప్రాణుల సంరక్షణకు ప్రభుత్వాలు చేపట్టిన పటిష్టమైన చర్యలతో ఇటీవలి కాలంలో పులుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సహజంగా చిరుత పులులు అధికంగా ఉంటాయి. ఫలితంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వెలుగొండ అడవుల్లో ఇటీవల పెద్ద పులులతో పాటు చిరుతల సంచారం కనిపిస్తోంది.

చిరుతల కలకలంతో గుర్తింపు..

ఇటీవల కాలంలో ఉదయగిరి, మర్రిపాడు ప్రాంతాల్లో కలకలం సృష్టించిన చిరుతల సంచారంపై అనుమానం వచ్చిన అటవీశాఖాధికారులు ట్రాప్ కెమెరాలు పెట్టడంతో వీటి చిరుతలే కాదు.. పెద్ద పులులు, చిరుతల ఉనికిని గుర్తించారు. శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతం నుంచి ఒకటి.. రెండు పెద్ద పులులు అటవీ ప్రాంతంలో ప్రవహిస్తున్న పెన్నానది ఆవాసంగా శ్రీపెనుశిల నరసింహస్వామి అభయారణ్యంలోకి ప్రవేశించినట్లు రెండు నెలల వ్యవధిలో అధికారులు గుర్తించారు. శ్రీ పెనుశిల నరసింహస్వామి అభయారణ్యంలోని వెలుగొండ అడవులు ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోకి వస్తాయి. దీంతో అటవీ సమీప గ్రామాల్లో ప్రజల నుంచి పులులకు ఎలాంటి అపాయం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. అటవీ సమీప గ్రామాల ద్వారా ఆ శాఖ బేస్ క్యాంపు సిబ్బంది, ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది పులులతో పాటు పలు అటవీ జంతువులకు తాగునీరు లభ్యమయ్యే విధంగా అడవిలోనే సిమెంట్ తొట్టెలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నీరు నింపేలా చర్యలు తీసుకున్నారు. వణ్యప్రాణులే కాకుండా వన్య మృగాలు కూడా గ్రామాల్లోకి ప్రవేశించకుండా ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించారు.



మర్రిపాడు మండలంలోని వెలుగొండ అడవుల్లో ఇటీవల సీసీ కెమెరాకు కనిపించిన పెద్ద పులి

వ్యాఘ్ర రాజుకు అభయం

అడవికి రాజైన వ్యాఘ్ర రాజుకు అభయం కలిగేలా వెలుగొండ అడవుల్లో పులుల సంచారం పెరుగుతుండడంతో వాటి సంతతి మరింత పెంచేందుకు, సంరక్షణకు శ్రీశైలం టైగర్ ఫారెస్ట్‌కు ఈ ప్రాంతాన్ని అనుసంధానం చేసేలా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు డీపీఓ పంపినట్లు సమాచారం. వెలుగొండ అడవుల పరిస్థితి, నీటి లభ్యత, పులుల ఆవాసానికి సరైన వాతావరణం, అడవి విస్తీర్ణం, తదితర పూర్తి అంశాలను పొందుపరిచిన నివేదికను రాష్ట్ర అధికారులకు అందజేయడంతో పాటు ట్రాప్ కెమెరాల్లో రికార్డు అయిన అంశాలను జోడించారు. దీంతో ఈ ప్రాంతాన్ని పులుల సంరక్షణ కేంద్రంగా గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్ర అధికారులకు అవగాహన కలిగింది. పెద్ద పులి సంచారంతో ప్రత్యేకంగా నీటి మడుగుల వద్ద ట్రాప్ కెమెరాలను, ట్రీ కెమెరాలను డీఎఫ్‌ఓ చంద్రశేఖర్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వెలుగొండ, మర్రిపాడు అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేయించారు. సమీప గ్రామాల్లో దండోరా వేయడం, పులుల సంరక్షణకు ప్రభుత్వ అధికారులకు సహకరించాలని అవగాహన సమావేశాలు నిర్వహించడం వంటి చర్యలతో వాటి రక్షణకు చర్యలు చేపట్టారు. అడవి జంతువులను వేటగాళ్ల నుంచి కాపాడేందుకు యాంటీ స్క్వాడ్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. నలుగురు బేస్ క్యాంపు సిబ్బందికి సమీపంలోని గిరిజనులను సహాయకులుగా తీసుకుని అడవి జంతువుల సంరక్షణకు కృషి చేసేలా పర్యవేక్షిస్తున్నారు.

విస్తరించనున్న టైగర్ రిజర్వ్

శ్రీశైలం పులుల అభయారణ్యం సుమారు 3,568 చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించింది. ఈ క్రమంలో వెలుగొండ, మర్రిపాడు అటవీ ప్రాంతానికి అనుసంధానంగా వెనుక వైపు 1.27 లక్షల ఎకరాల అటవీ భూమి విస్తరించి ఉంది. దీని చివరి భాగం నాగార్జున సాగర్, శ్రీశైలం పులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్)కు సమీపంలోనే ఉండడం 'టైగర్ సేఫ్ జోన్' ఏర్పాటు చేసేందుకు కలిసి వచ్చే అంశమని అధికారులు చెబుతున్నారు. దీంతో త్వరలోనే ఈ ప్రాంతాన్ని పడమర వైపు ఉన్న సోమశిల జలాశయంతో సహా కలుపుకొని శ్రీశైలం పులుల అభయారణ్యానికి అనుసంధానం చేసేందుకు అవకాశం మెండుగా ఉన్నాయని అధికారుల నుంచి సమాచారం అందుతోంది.



అడవుల్లో పులుల జాడ కోసం పాదముద్రలు సేకరించేందుకు సిద్ధంగా అధికారులు (ఫైల్)

పులుల సంచారం ఇలా

సాధారణంగా పులులు సంచరించే విధానం మిగిలిన జంతువులతో పోలిస్తే భిన్నంగా ఉంటుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. పెంచలకోన అభయారణ్యంలో 5 నుంచి 7 చిరుత పులులు సంచరిస్తున్నాయని, మర్రిపాడు నుంచి ఉదయగిరి వరకు అటవీ ప్రాంతంలో 15 వరకు పైగా చిరుతలు, ఒక పెద్ద పులి సంచరిస్తున్నట్లు సమాచారం అటవీశాఖ అధికారులకు లభించింది. సంరక్షణ చర్యలతో పులుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. శ్రీశైలం అభయారణ్యంలో సంచరించే పెద్ద పులులు ఒక్కొక్కటి తమ సామ్రాజ్యాన్ని 40 నుంచి 50 కిలో మీటర్ల పరిధిలో విస్తరించుకుని ఉన్నాయి. ఈ క్రమంలో పెరిగిన పులుల సంఖ్యతో తమ సామ్రాజ్యం ఏర్పాటు చేసుకొనేందుకు ఒకటో, రెండో పులులు వెలుగొండ అడవుల్లోకి నదీ తీర ప్రాంతం ద్వారా చేరుకున్నాయని గుర్తించారు. అడవికి రాజైన పెద్ద పులి తమ సామ్రాజ్యంలోకి మరో పులిని రానివ్వదని అధికారులు తెలిపారు. అవి తమ విస్తరణను పెంచుకునేందుకు నూతన ప్రాంతాలకు వస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ ప్రాంతంలో భవిష్యత్‌లో పెద్ద పులుల సంఖ్య పెరిగితే అప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని, ముందస్తుగానే ప్రాజెక్ట్ ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులకు పూర్తి సమాచారం ఇచ్చినట్లు జిల్లా అధికారులు తెలిపారు.



మర్రిపాడు అడవుల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది (ఫైల్)

రైతుకు మిత్రులు పులులు



పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల రైతులకు చిరుత పులులు, పెద్ద పులులు మిత్రులనే చెప్పవచ్చు. కారణం వారు సాగు చేసే పంటలను అడవి పందులు, దున్నలు, కనుజులు, ముళ్ల పందులు, తదితర పలు అడవి జంతువులు నాశనం చేస్తుంటాయి. దీంతో వారు పంటలను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఆ ప్రాంతాల్లో పులులు సంచరిస్తుంటే ఈ చిన్న జంతువులు వాటికి ఆహారం అవుతాయి. దీంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతోంది. అయితే పులులను వేటాడడం, వాటిని పట్టుకునేందుకు ఉచ్చులు వేయడం, కరెంట్ పెట్టడం వంటివి చేస్తే వారిపై తీవ్ర చర్యలు ఉంటాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత వాసులు, రైతులు పులుల సంఖ్య పెరిగేందుకు, పులుల సంరక్షణకు అందరు సహకరించాలి.

– ఎ.చంద్రశేఖర్‌రావు, డీఎఫ్‌ఓ, నెల్లూరు

ఆగని తమ్ముళ్ల చీకటి దందా

ఇసుక విషయంలో చంద్రబాబు మాటలకు అర్థాలే వేరన్నట్లుగా ఉంది. ఒక వైపు ఎమ్మెల్యేలు, మంత్రులను కట్టడి చేస్తున్నట్లే చెబుతూనే.. మరో వైపు ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలంటూ కలెక్టర్, ఎస్పీలను ఆదేశిస్తున్నారు. ఇదంతా నాణేనికి ఒక వైపు మాదిరిగానే కనిపిస్తోంది. జిల్లాలో పెన్నానది ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడపడితే అక్కడ ఇసుక కొల్లగొట్టేస్తున్నారు. నిత్యం పగలు అధికారిక విక్రయాలు అరకొరగా ఉంటే.. రాత్రి పూట అక్రమ రవాణా ఇసుకే ఎక్కువగా ఉంది. అయినా పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేయలేదు.



రాత్రి వేళ లారీలో తరలిపోతున్న ఇసుక

- పగలంతా గప్‌చుప్.. రాత్రయితే రైట్‌రైట్
- ఇతర రాష్ట్రాలకు విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా
- అనంతసాగరం మండలంలో బరితెగిస్తున్న ఇసుకాసురులు
- రోజూ జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- కలెక్టర్, ఎస్పీలు మాటల్లోనా? చేతల్లో చూపించరా?

సాక్షి ప్రతినిధి నెల్లూరు: జిల్లాలో ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. అధికారం అండతో పెన్నా నదీ గర్భంలో ఇసుకను తోడేసి దోచేస్తున్నారు. గడిచిన నెల రోజులకు పైగా జిల్లాలో ఇసుక కొరత ఏర్పడింది. జిల్లాలో కేవలం మూడు డంపింగ్ యార్డుల నుంచి మాత్రమే ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లా ప్రజల అవసరాలకు సరిపడే స్థాయిలో నది నుంచి ఇసుక తవ్వకాలు చేయలేక మైనింగ్ శాఖాధికారులు చేతులెత్తేశారు. దీంతో టీడీపీ నేతలు నేరుగా పగలు సైతం ట్రాక్టర్లు, టిప్పర్లతో నేరుగా రీచ్‌లోకి వెళ్లి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఇక రాత్రి పూట అయితే జిల్లా అవసరాలను పక్కన పెట్టేసి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు భారీ ఎత్తున ఇసుకను తరలిస్తున్నారు. నిత్యం జిల్లాలోని రీచ్‌ల నుంచి 200 వరకు భారీ లారీల్లో తరలిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పగలు అయితే ఇటు రీచ్‌ల వద్ద కానీ, చెక్ పోస్టుల్లో తనిఖీలు లేకుండా వెళ్లిపోవచ్చనే ఆలోచనతో పగలంతా ఏమీ జరగనట్లు ఉంటున్న నేతలు రాత్రయితే ఇసుకాసురుల్లా రెచ్చిపోతున్నారు. ఇసుక దందాపై పత్రికలు ఘోషిస్తున్నా.. కలెక్టర్, ఎస్పీలు సైతం మిన్నకుండిపోతున్నారు. అధికారం చేష్టలుడిగి చూస్తుండడంతో ఇసుకాసురులు మాత్రం రెచ్చిపోతున్నారు.

ఆత్మకూరు నుంచే 100 వాహనాల్లో రవాణా

జిల్లా నుంచి నిత్యం దాదాపు 200 లారీలు పక్క రాష్ట్రాలకు తరలిపోతుంటే.. ఒక్క ఆత్మకూరు నియోజకవర్గం నుంచి 100 లారీలు తరలిపోతున్నాయి. అనంతసాగరం, ఆత్మకూరు, సంగం మండలాల్లోని పెన్ననదీ గర్భాన్ని నిత్యం తోడేస్తున్నారు. శంకరనగరం, రేవూరు పంచాయతీల పరిధిలో పాటు దువ్వూరు, పడమటిపాళెం, సిద్ధీపురం ప్రాంతాల నుంచి రోజూ రాత్రి వేళల్లో నదిలో యంత్రాలు పెట్టి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రహదారి సమీపంలోని డంపింగ్ చేస్తున్నారు. అక్కడ మరో యంత్రం ద్వారా 12 టైర్ల టిప్పర్లు, లారీలకు లోడింగ్ చేస్తున్నారు. నిత్యం దాదాపు 100 వాహనాలకు లోడింగ్ జరుగుతోంది. ఒక్కో వాహనానికి 32 టన్నుల ఇసుకను జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. నిత్యం సగటున ఒక్క ఆత్మకూరు నియోజకర్గం నుంచే ప్రభుత్వం నిర్ణయించిన ఇసుక ధర ప్రకారమే రూ.12 లక్షలు ఉంటే.. పక్క రాష్ట్రాలకు చేరే సరికి ఇసుక విలువ రూ.70 లక్షల నుంచి రూ.85 లక్షలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.



ఆత్మకూరు మండలం వాశిలి చెరువుకట్ట సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా నిల్వ చేసిన ఇసుక (ఫైల్)

మర్రిపాడులో ఇసుక అమ్మకాల నిలిపివేత

మర్రిపాడు: మర్రిపాడు డంపింగ్ యార్డులో ఆదివారం నుంచి ఇసుక రీచ్‌లో అమ్మకాలు నిలిచిపోయాయి. సోమశిల జలాశయం వద్ద అప్రాన్ పనులకు 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉందని, ఇక్కడి నుంచి తరలించాలని అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో అమ్మకాలు నిలిపివేసినట్లు తహసీల్దారు స్వప్న తెలిపారు. ఆదివారం రీచ్‌ను మైనింగ్ శాఖాధికారులతో కలిసి తహసీల్దార్ పరిశీలించారు. ప్రస్తుతం మర్రిపాడు డంపింగ్ యార్డులో 43 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉందన్నారు. సోమశిలకు అవసరమైన ఇసుకను తరలించిన అనంతరం మిగిలిన ఇసుకను అమ్మకాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. అప్పటి వరకు మర్రిపాడు డంపింగ్ యార్డు నుంచి విక్రయాలు నిలిచిపోనున్నాయి. జిల్లాలో మినగల్లు, మర్రిపాడు, పల్లిపాడు డంపింగ్ యార్డుల నుంచి ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. తాజాగా మర్రిపాడు నుంచి ఇసుక విక్రయాలు నిలిచిపోవడంతో ఇక రెండు యార్డుల నుంచే విక్రయాలు జరగనున్నాయి. ఇప్పటికే మూడు యార్డుల నుంచి విక్రయాలు చేస్తుంటేనే ఇసుక సరిపోక.. కొరతతో జిల్లాలో నిర్మాణ రంగం కుదేలైపోయింది. ఇక రెండు యార్డుల నుంచే విక్రయాలతో మరింతగా ఇసుక కొరత ఏర్పడుతోంది.

అధికారులకు మామూళ్లు ఇచ్చుకుంటూ..

జిల్లా నుంచి ఇసుకను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్న అక్రమార్కులు స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి సెబ్, ఆర్టీఓ అధికారుల వరకు ప్రతి వాహనానికి నెలవారీగా మామూళ్లు ఇచ్చుకుంటారు. నెలకు ఒక్కో వాహనానికి రూ.50 వేలు వంతున ముడుపులు ఇస్తున్నట్లు సమాచారం. వాహన నంబర్లు అధికారుల వద్ద ఉంటాయి. ఒకవేళ రాత్రి వేళల్లో రోడ్లపై ఉండే పోలీసులకు వాహన నంబర్లు చూసి పంపుతారు. మామూళ్లు ఇవ్వకుండా వాహనం దొరికితే చాలు వెంటనే పట్టేస్తారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లుగా షో చేస్తున్నారు. ఇసుకాసురులు మాత్రం అధికారులను మామూళ్లు ఇచ్చుకుంటూ రిస్క్ లేకుండా అక్రమార్జన సాగిస్తుంటారు.

నేతలకు మామూళ్లే..

ఇసుకాసురులు అధికారులకే కాదు అధికార పార్టీకి చెందిన బడా నేతలకు కూడా మామూళ్లు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పార్టీ అధికారంలో వచ్చేందుకు కష్టపడ్డామని, పెట్టుబడులు పెట్టామని మా సంగతేందని ఇసుకాసురులపై ఒత్తిడి పెట్టడంతో వారికి కూడా కొంత మామూళ్లు ఇచ్చుకుంటున్నట్లు సమాచారం.

ఇసుకాసురులకు అధికారం అండ

అనధికార ఇసుక రీచ్‌ల నుంచి రాత్రి వేళల్లో ఇసుకను తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్న ఇసుకాసురులకు అధికారులు అండగా నిలుస్తున్నారు. నియోజకవర్గ అధికార పార్టీ నేతల నుంచి స్థానిక పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు వారికి సహకరిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారుల కూడా తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతో ఇసుక అక్రమ రవాణాను అరికట్టే ప్రయత్నాలు చేయలేక చేష్టలుడిగి చూస్తున్నారు. ముఖ్యంగా మైనింగ్ శాఖాధికారులు మాత్రం ఇసుకాసురుల నుంచి మామూళ్లు పిండికుంటున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి ఆహ్వానం

పొదలకూరు : పొదలకూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) కోర్సుల్లో మూడో విడత ప్రవేశాలకు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.మురళీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీలోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను అందించాలని సూచించారు. సూయింగ్ టెక్నాలజీ (8వ తరగతి పాస్, ఏడాది కాలపరిమితి), కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (10వ తరగతి పాస్, ఏడాది కాల పరిమితి), డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ (10వ తరగతి పాస్, రెండేళ్ల కాలపరిమితి), హార్టికల్చర్ (10వ తరగతి పాస్, ఏడాది కాలపరిమితి) ఉంటుందన్నారు. ఈ నెల 27వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాల్సిందిగా వెల్లడించారు. మూడో విడత కౌన్సెలింగ్‌కు ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు సోమశిల మార్గంలోని చిట్టేపల్లి తిప్ప వద్ద నూతన కళాశాల భవనం వద్దకు హాజరు కావాల్సిందిగా సూచించారు.

16 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు, బైక్‌లు

పొదలకూరు : మండలంలోని మరుపూరు గ్రామ చెరువు వద్ద పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించి 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు.. ముందుగా అందిన సమాచారంతో సీఐ ఆర్.రాంబాబు ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై దాడులు చేశామన్నారు. నిందితుల అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుంచి రూ.10,120 నగదు, 13 మొబైల్ ఫోన్లు, 10 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. సెలవు రోజు కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన ఇక్కడ పేకాట ఆడుతున్నట్లుగా తెలుస్తోంది.

➡ నెల్లూరు నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి వాట్సాప్‌కు వీడియోకాల్ వచ్చింది. ఆయన లిఫ్ట్ చేయగానే అందమైన యువతి అర్ధనగ్నంగా అతడితో మాటలు కలిపింది. మాట్లాడుతుండగానే కాల్ కట్ అయ్యింది. కొద్దిసేపటికే ఓ వ్యక్తి అతడికి కాల్‌చేసి యువతితో మాట్లాడిన వీడియో రికార్డింగ్‌ను పంపి నగదు డిమాండ్ చేశాడు. అడిగినంత ఇవ్వకపోతే ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించి దోచుకున్నాడు.

➡ నెల్లూరు సుబేదారుపేటలో ఓ ప్లై ఉడ్ షాపునకు ఓ వ్యక్తి వచ్చి రూ.24,472 విలువైన సామగ్రి కొనుగోలు చేశాడు. తన చేతికి రూ.10 వేలిస్తే మొత్తంగా రూ.34,472ను ఎన్‌ఈఎఫ్‌టీ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేస్తామని నమ్మించాడు. షాపు యజమాని అతడికి నగదు ఇవ్వగా ఎన్‌ఈఎఫ్‌టీ ద్వారా నగదు పంపినట్లు స్క్రీన్ షాట్ చూపించి వెళ్లిపోయాడు. సదరు యజమాని ఆన్‌లైన్‌లో చూడగా నగదు జమ కాలేదు. కస్టమర్ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

➡ నెల్లూరు ఆచారివీధికి చెందిన ఓ వ్యాపారికి సీబీఐ అధికారి పేరిట ఫోన్ వచ్చింది. మీకు కొరియర్ వచ్చిందని అందులో డ్రగ్స్ ఉన్నాయని మీపై కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పాడు. కేసు వద్దంటే రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ తరహా మోసాలపై అవగాహన ఉన్న వ్యాపారి తాను పోలీసు అధికారినని చెప్పడంతో వెంటనే నిందితుడు ఫోన్ పెట్టేశాడు. వ్యాపారి ఆ నంబర్‌కు తిరిగి కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది.

➡ నెల్లూరు వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ భర్త నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటోంది. ఆన్‌లైన్ మ్యాట్రిమోనీ ద్వారా రెండో వివాహానికి తన వివరాలను పంపింది. ఓ వ్యక్తి ఫోన్ చేసి వివాహం చేసుకుంటానని నమ్మబలికాడు. అతని మాటలను ఆమె గుడ్డిగా నమ్మింది. తన ఇంట్లోని వారు ఆస్పత్రిలో ఉన్నారని నగదు అత్యవసరమని చెప్పి ఆమె వద్ద రూ.14 లక్షలను సదరు వ్యక్తి తీసుకున్నాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఆమె అనేకసార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సైబర్ వల.. జనం విలవిల

సరికొత్త పంథాలో వస్తున్న నేరగాళ్లు

- చిక్కితే బ్యాంక్ ఖాతా ఖాళీ
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- అప్రమత్తత ఎంతో అవసరం



నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అంతు లేకుండా పోతోంది. కొత్త పంథాలో జనాన్ని దోచేస్తున్నారు. పోలీసులు, దర్యాప్తు సంస్థల అధికారులమని బెదిరింపులు, ఈకేవైసీల పేరిట లింక్‌లు పంపి, క్రిప్టో కరెన్సీ, వలపువలలు విసిరి, ఇంకా అనేక విధాలుగా నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారు. దీనికి అడ్డుకట్ట పడాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించడం అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎవరైనా మోసపోతే వెంటనే పోర్టల్లో ఫిర్యాదు చేస్తే.. దేశవ్యాప్తంగా ఒకేసారి వివరాలు వెళ్లి సంబంధిత నేరంపై విచారణ సులవవుతుంది. తక్షణ ఫిర్యాదుతో బాధితులు కోల్పోయిన డబ్బులు తిరిగి పొందే అవకాశాలుంటాయి. ఎనిమిది నెలల వ్యవధిలో జిల్లాలో 40కుపైగా కేసులు నమోదయ్యాయి. చాలామంది పోలీసుల చుట్టూ తిరగలేమని ఫిర్యాదు చేయడం లేదు.

ఎన్నో మోసాలు

➡ ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువ మంది ఆన్‌లైన్‌లో ఉన్న వివిధ వివాహ వెబ్‌సైట్‌లలో ఫొటోలతో సహా తమ బయోడేటా నమోదు చేసుకుంటున్నారు. మోసగాళ్లు ఈ వివరాలు తీసుకుని ఫోన్ లేదా ఈ-మెయిల్లో సంప్రదిస్తున్నారు. కొందరైతే ముఠాగా ఏర్పడుతున్నారు. వరుడు లేదా వధువు తల్లిదండ్రులమని చెప్పి మాటలు కలుపుతున్నారు. అవతలి వైపు నుంచి నమ్మకం పొందాక తమ ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఏదో ఒక అవసరం ఉందని చెప్పి అందినకాడికి దోచుకుంటున్నారు.



➡ సాంకేతికత అభివృద్ధి నేపథ్యంలో ప్రతీది డిజిటల్ అయ్యింది. బయటికి వెళ్లకుండా వస్తువులు, ఆహారం తెప్పించుకుని తింటున్న పరిస్థితులు వచ్చాయి. ఎక్కువమంది ఆన్‌లైన్ షాపింగ్‌పైనే ఆధారపడుతున్నారు. క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్ ఉన్నా డిస్కౌంట్‌లు, మరేదైనా ఆఫర్ల కోసం క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారానే నగదు చెల్లిస్తున్నారు. దీన్ని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. నకిలీ వెబ్‌సైట్లను ఆన్‌లైన్‌లో ఉంచుతున్నారు. వాటిలో లాగిన్‌లై వ్యక్తిగత సమాచారం నమోదు చేయడంతో మన ఖాతాల నుంచి నగదు దోచేస్తున్నారు.

➡ మేము ముంబైలోని కొరియర్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్ చేస్తారు. మీ పేరుతో విదేశాల నుంచి పార్శిల్ వచ్చింది. అందులో డ్రగ్స్ ఉన్నాయని భయపెడతారు. అవి మీకు ఎలా వచ్చాయో చెప్పాలని బెదిరిస్తారు. కేసు దర్యాప్తు అధికారితో మాట్లాడాలంటూ మరో వ్యక్తికి ఇస్తారు. సదరు వ్యక్తి సీబీఐ/ఈడీ/నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారినంటూ పరిచయం చేసుకుంటారు. డ్రగ్స్‌తో మీకు సంబంధం ఉంది. ఇది తీవ్రమైన నేరం అంటూ హడలెత్తిస్తారు. వీడియో కాల్‌చేసి విచారణ పేరిట హడావుడి చేస్తారు. కేసు నుంచి బయట పడాలంటే తాము చెప్పినంత మొత్తం చెల్లించాలని లేకపోతే అరెస్ట్ తప్పదని కంగారు పెడతారు. ఇదంతా నిజమేనని నమ్మి వారు అడిగినంత సొమ్ము బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేస్తూ అనేకమంది మోసపోతున్నారు.

➡ వాట్సాప్ కాల్స్ ద్వారా అశ్లీలంగా మాట్లాడుతూ ఆపై వీడియోలు తీసి బెదిరిస్తున్న సైబర్ నేరగాళ్లు పెరిగారు. యువకులు, ఉద్యోగులే లక్ష్యంగా రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ ముఠాలు వలపువల విసురుతున్నారు. బుట్టలో పడినవారిని బెదిరించి నగదు దోచేస్తున్నారు. పరువు పోతుందన్న భావనతో బాధితులు నిందితులు అడిగినంత డబ్బు పంపుతున్నారు.

➡ ఇటీవల కాలంలో స్పూఫ్ యాప్‌లు చాలా వచ్చాయి. పంపించని డబ్బు కూడా పంపినట్లు రుజువుగా స్క్రీన్‌షాట్‌లు పంపించే వెసులుబాటు అందుబాటులో ఉంది. అది చూసిన వాళ్లకు ఎక్కడా అనుమానం రాదు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌లో డబ్బులు అడిగితే పంపించామని చెబుతున్నప్పుడు జాగ్రత్త వహించండి.

➡ క్రిప్టో కరెన్సీ, బ్లాక్ ట్రేడింగ్‌ల్లో పెట్టుబడులు పెట్టండి. ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో కళ్లు చెదిరే ఆదాయం పొందండి. అంటూ సంబంధిత వాట్సాప్ గ్రూప్‌ల్లో మీ నంబర్ చేరుస్తారు. వాటివైపు ఆకర్షించి.. భారీగా పెట్టుబడులు పెట్టిస్తారు. మీ పెట్టుబడి కంటే అధిక ఆదాయం వచ్చినట్లు అదంతా క్రిప్టో కరెన్సీ రూపంలో మీ ఖాతాలో ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తారు. సొమ్ము విత్‌డ్రా కావాలంటే మరింత చెల్లించాలంటూ ఉచ్చులోకి లాగి అందినకాడికి దోచేస్తారు.

➡ ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. ఏటీఎం సౌకర్యం లేని ప్రాంతాల్లో నగదును తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఏఈపీఎస్ పద్ధతిని ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఫింగర్ ప్రింట్ సాయంతో రోజుకు రూ.10 వేల వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంది. దీంతో సైబర్ నేరగాళ్లు పలు రూపాల్లో ప్రజల వేలిముద్రలను సేకరించి ఏఈపీఎస్ ద్వారా డబ్బులు దోచేస్తున్నారు.

ఫిర్యాదు చేసేందుకు..

సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్ :
1930
ఆర్థిక నేరాలకు సంబంధించి :
155260
వెబ్‌సైట్: సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్
ఎనిమిది నెలల వ్యవధిలో జిల్లాలో నమోదైన కేసులు : **40**



ఎన్‌ఈఎఫ్‌టీ మోసం ఇలా..

ఈ సమయంలో చేస్తే..

ఎవరైనా ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలుచేస్తే సంబంధిత కొనుగోలుదారులకు బ్యాంకు ఖాతా నుంచి డబ్బు ఈ-కామర్స్ వెబ్‌సైట్ నిర్వాహకులకు చేరేందుకు రెండు రోజులు పడుతుంది. సైబర్ నేర దర్యాప్తులో ఈ సమయాన్ని గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారు. నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే పోలీసులు ఈ-కామర్స్ వెబ్‌సైట్‌ల ప్రతినిధులకు ఈ-మెయిల్ పంపి. కొనుగోలు లావాదేవీలను నిలిపేందుకు కృషి చేస్తారు. తద్వారా నేరగాళ్ల పాలైన సొమ్ము బాధితుల ఖాతాకు తిరిగి తెప్పించే అవకాశం ఉంది.

ఎక్కడైనా..

గతంలో సైబర్ నేరస్తుల వలలో చిక్కిన సందర్భాల్లో ఫిర్యాదు చేయాలన్నా ఇబ్బందిగా ఉండేది. అయితే దేశవ్యాప్తంగా నేరాలు పెరుగుతుండడంతో ఫిర్యాదులను సరళతరం చేశారు. దేశంలో ఎక్కడి బాధితులైనా ఒకే నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు చెప్పడం ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. బాధితులు తొందరగా స్పందిస్తే వీలైనంత మేర సొమ్ము తిరిగి తెప్పించే అవకాశం ఉంది.

ఫిర్యాదు చేయండి




సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా జాగ్రత్త పడాలి. లింక్‌లను క్లిక్ చేయరాదు. సోషల్ మీడియాలో గుర్తుతెలియని వ్యక్తుల మెసేజ్‌లకు స్పందించరాదు. బ్యాంకుల పేరుతో వచ్చే కాల్స్‌కు ఓటీపీలు చెప్పొద్దు. అనవసర యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దు. కస్టమ్స్, సీబీఐ, ఈడీ నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా చెబితే కచ్చితంగా అనుమానించాలి. క్రిప్టో కరెన్సీ, బ్లాక్‌ట్రేడింగ్ పేరుతో మిమ్మల్ని ఏదైనా వాట్సాప్ గ్రూపుల్లో చేరిస్తే వెంటనే వాటి నుంచి బయటకు వచ్చేయండి. సైబర్ మోసాలకు గురైతే సమీప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
– డి.శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

క్లుప్తంగా

పోటాపోటీగా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఎన్నికలు

- అధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్


నూతన కార్యవర్గానికి సన్మానం

నెల్లూరు(అర్బన్): ది నెల్లూరు జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో పేరూరి ప్రదీప్‌కుమార్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. నెల్లూరు రంగనాయకులపేటలో ఉన్న ఐరన్ హార్డ్‌వేర్ అండ్ పెయింట్స్ మర్చంట్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పేరూరి ప్రదీప్‌కుమార్ ప్యానెల్, అజయ కుమార్ ప్యానెల్ పోటీ పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా 745 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు హాజరైన 438 మంది ఓట్లు వేశారు. ప్రదీప్‌కుమార్ ప్యానెల్‌కు 312, అజయ్‌కుమార్ ప్యానెల్‌కు 126 ఓట్లు వచ్చాయి. దీంతో ప్రదీప్‌కుమార్ 186 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు శ్రీనివాసరావు, పాపిశెట్టి ప్రకటించారు. పరిశీలకులుగా పి.శివకుమార్, టీఎస్ రామగుప్తా వ్యవహరించారు. అనంతరం జరిగిన సభలో సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రత్నం, కోశాధికారి సాదు ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రదీప్‌కుమార్, ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు, ట్రెజరర్ వెంకటేశ్వర్లును సన్మానించారు. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగనున్నట్లు చెప్పారు. కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ దుకాణాల యజమానుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్

నెల్లూరు(క్రైమ్): ఓ యువకుడు రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా ట్రాఫిక్ కానిస్టేబుల్ అతడిని రక్షించారు. ఈ ఘటన పాతచెక్‌పోస్టు సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరుకు చెందిన ఓ యువకుడు బీటెక్ వరకు చదువుకుని ఉన్నత ఉద్యోగం చేశాడు. మానసికస్థితి సక్రమంగా లేక ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్నాడు. అతను ఆత్మహత్య చేసుకునేందుకు ఆదివారం పాతచెక్‌పోస్టు సమీపంలోని రైలు పట్టాల వద్దకు వెళ్లగా విధుల్లో ఉన్న నార్త్ ట్రాఫిక్ కానిస్టేబుల్ పి.చెన్నయ్య గమనించాడు. పరుగులు తీసుకుంటూ యువకుడి వద్దకు వెళ్లి అతడిని రక్షించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించాడు. యువకుడు ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ చెన్నయ్యను పలువురు అభినందించారు.

ఊరెళ్లారు.. సొత్తు దోచేశారు

- ఎఫ్‌సీఐ కాలనీలో 381 గ్రాముల బంగారం, 1,230 గ్రాముల వెండి చోరీ

నెల్లూరు(క్రైమ్): వారు ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. ఇదే అదునుగా భావించి దుండగులు ఇంట్లోని రూ.లక్షల విలువ చేసే సొత్తును దోచుకెళ్లారు. ఈ ఘటన నెల్లూరు నగరంలోని ఎఫ్‌సీఐ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. ఎఫ్‌సీఐ కాలనీలో సుప్రియ, జోసెఫ్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు సంతానం. వాకాడు మండలం తూపిలిపాళెంలో జోసెఫ్ తల్లి ఉంటున్నారు. ఆమెకు అనారోగ్యంగా ఉండడంతో శనివారం రాత్రి సుప్రియ దంపతులు అక్కడికి వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువా లాకర్‌లోని 381 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,230 గ్రాముల వెండి వస్తువులు, రూ.15 వేల నగదు, యూనికాన్ మోటార్‌బైక్‌ను అపహరించుకెళ్లారు. ఇంటి తాళాలు తెరిచి ఉండడంతో స్థానికులు సమీపంలో నివాసం ఉంటున్న సుప్రియ తల్లి, అన్నకు సమాచారం అందించారు. వారు వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో చోరీ ఘటనపై సుప్రియకు సమాచారం అందించారు. బాధితులు వెంటనే నెల్లూరుకు చేరుకుని నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.23 లక్షలు ఉంటుందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

అల్లుడి చేతిలో మామ హతం

- నెల్లూరు నగరంలో దారుణం

నెల్లూరు(క్రైమ్): భార్యను కాపురానికి పంపలేదని అక్కసుతో అల్లుడు తన మామను దారుణంగా హత్య చేసిన ఘటన నెల్లూరులోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మూడో మైలులో ఆసిఫ్ (60) నివాసం ఉంటున్నాడు. భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన మద్రాస్ బస్టాండ్ వద్ద పూలు అమ్మి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమార్తెను రంగనాయకులపేటకు చెందిన షఫీకి ఇచ్చి వివాహం చేశారు. అతను కార్పెంటర్ పనిచేస్తున్నాడు. ఈ దంపతుల నడుమ విభేదాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో షఫీ భార్య మూడునెలలుగా పుట్టింట్లో ఉంటోంది. భార్యను కాపురానికి పంపించాలని షఫీ పలుమార్లు మామను కోరాడు. అతను స్పందించకపోవడంతో కక్ష పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి ఆసిఫ్ పూలు విక్రయిస్తుండగా షఫీ అక్కడికి వెళ్లి అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచి పరారయ్యాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆసిఫ్‌ను జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.


ఆసిఫ్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మృతుడు నెల్లూరు వాసి


హర్షవర్ధన్ మృతదేహం

దుత్తలూరు: కారు అదుపు తప్పి బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని బండకిందపల్లి సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన హర్షవర్ధన్ (30) దుత్తలూరు నుంచి నెల్లూరు వైపు కారులో వెళ్తున్నాడు. బండకిందపల్లి సమీపంలోకి వచ్చేసరికి కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఉదయగిరి సీఐ గిరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వాహనంలో దొరికిన విజిటింగ్ కార్డులోని ఫోన్ నంబర్‌కు కాల్ చేశారు. హర్షవర్ధన్ బంగారు దుకాణం నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్నారు. అతడికి వివాహమైనట్లు సమాచారం. కాగా కారులో బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి.


ఘటనా స్థలంలో కారు

పోల్ ఎక్కేస్తా.. పనిచేస్తా


మరమ్మతులు చేస్తున్న ఏఈ రమేష్‌బాబు


నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బంది (లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్)లో చాలామంది స్తంభాలు (పోల్స్) ఎక్కలేని పరిస్థితుల్లో ఉన్నారు. సరఫరాలో సమస్యలు తలెత్తిన సమయంలో, లైన్లు మరమ్మతులకు గురైన సందర్భంలో వీరు స్తంభాలు ఎక్కలేక తమ అసిస్టెంట్లు, ఏఎల్‌ఎం, జేఎల్‌ఎంలను ఎక్కించి పనులు చేయిస్తుంటారు. విధి నిర్వహణలో సిబ్బందికి స్ఫూర్తినిచ్చేలా ఓ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) స్వయంగా స్తంభం ఎక్కి పనిచేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఇనమడుగు విద్యుత్ సెక్షన్‌లో రమేష్‌బాబు ఏఈగా ఉన్నారు. సెక్షన్ పరిధిలో లైన్ మరమ్మతులకు గురికాగా ఆయన సిబ్బందితో కలిసి స్తంభం ఎక్కి మరమ్మతులు చేశారు.

శ్రీవారికి చందనాలంకరణ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామికి ఆదివారం చందనంతో అలంకరించారు. ఆదివారం స్వాతి నక్షత్రం కావడంతో మూలమూర్తికి విశేష పూజలు చేశారు. అనంతరం చందనంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం చేశారు. 11 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం గంటలకు అన్నదానం చేశారు. రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై కొలువుదీరి ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.


పూజలు చేస్తున్న వేదపండితులు

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.105
సన్నవి	: రూ.80
పండ్లు	: రూ.60

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 101
లేయర్ (లైవ్)	: 90
బ్రాయిలర్ చికెన్	: 194
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 214
లేయర్ చికెన్	: 153